## క్లుప్తంగా

### సంక్రాంతి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : సంక్రాంతి పండుగ శోభ శనివారం నుంచి భోగిమంటలతో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా నియోజకవర్గంలోని ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే అచ్చమైన తెలుగుపండుగ సంక్రాంతిగా అభివర్ణించారు. మకర సంక్రాంతి రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో అభివృద్ధితో కూడిన మార్పు తీసుకురావాలని, పండుగ సంబరాలతో ప్రతి ఇంటిలోనూ ఆనందాల సిరులు వెల్లివిరియాలని అభిలషించారు.

### టమాట బాక్సు రూ.600



ములకలచెరువు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం వచ్చిన నాణ్యమైన టమాటల బాక్సు ధర రూ.600 పలికాయి. గత నెల రోజులుగా పూర్తి స్థాయిలో పతనమైన టమాట ధరలు రెండు రోజులుగా పుంజుకున్నాయి. 30 కేజీల బాక్సు రూ.500 నుంచి 600 వరకు పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

### సారా ఊట ధ్వంసం

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ పరిధిలోని తంబళ్లపల్లె మండలం ముద్దలదొడ్డి పరిసర ప్రాంతంలో సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక శుక్రవారం తెలిపారు. వివరాలిలా..ముద్దలదొడ్డి సమీపంలో నాటుసారా వండుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బంది దాడులు నిర్వహించి సుమారుగా 800 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

### జూదరుల అరెస్టు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కుమ్మరవారిపల్లి సమీప పొలాల్లో జూదం ఆడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసామని ఎస్‌ఐ మధురామచంద్రుడు శుక్రవారం పేర్కొన్నారు. వారి వద్ద లభించిన రూ.5,350ల నగను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామని ఎస్‌ఐ తెలిపారు.

**ఆరుగురు అరెస్టు**

పెద్దమండ్యం: జూదం ఆడుతున్న ఆరుగురిని శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ పి.వెంకటేష్ తెలిపారు. మండలంలోని సి.గొల్లపల్లి పంచాయతీ ముసలికుంటవారిపల్లె సమీపంలో జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ములకలచెరువు సీఐ సాదిక్‌అలీ ఆధ్వర్యంలో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. జూదరుల నుంచి రూ.14,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**పేకాట ఆడుతున్న ముగ్గురు..**

మదనపల్లె : మండలంలో పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ చంద్రమోహన్ శుక్రవారం తెలిపారు. చీకలగుట్ట సమీపంలో పట్టణానికి చెందిన సంతోష్, గౌస్‌బాషా, రామ్మోహన్ పేకాడుతుండగా ముందస్తు సమాచారంతో దాడిచేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,020 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

### రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

మదనపల్లె సిటీ: నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు జిల్లా హాకీ జూనియర్ జట్టు క్రీడాకారులు వెళ్లారు. జిల్లా నుంచి 12 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరిని జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి, కోచ్ నౌషాద్‌లు అభినందించారు. క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ చేశారు. విజయం సాధించి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

### అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు

మదనపల్లె సిటీ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలంకు వచ్చే నెల 4న ప్రత్యేక బస్సు సర్వీసును నడపనున్నట్లు ఆర్టీసీ డిపో- 1 మేనేజర్ మూరె వెంకటరమణారెడ్డి తెలిపారు. పౌర్ణమి పురస్కరించుకు సూపర్ లగ్జరీ ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8.30 గంటలకు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనాలు అనంతరం అరుణాచలంకు వెళ్లి గిరి ప్రదక్షిణ తరువాత మదనపల్లెకు మరుసటి రోజు చేరుకుంటుందన్నారు.

**సాధారణ చార్జీలతో ప్రత్యేక సర్వీసులు**

ప్రయాణికుల సౌకర్యం కోసం సాధారణ చార్జీలతో ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. వచ్చే నెల 4న మాఘ పౌర్ణమి పురస్కరించుకుని తరువణ్ణామలైకి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్, అల్ట్రాడీలక్స్‌లను నడపనున్నట్లు తెలిపారు. అల్ట్రా డీలక్స్‌లో రాను పోను చార్జీ రూ.790, ఎక్స్‌ప్రెస్‌లో రూ.640 చెల్లించాలన్నారు.

### మొదటి దశలోనే కత్తెర పురుగు నివారణ

బి.కొత్తకోట: కత్తెర పురుగును మొదటి దశలోనే గుర్తిస్తే నివారణ చేయవచ్చని కలికిరి కేవీసీ శాస్త్రవేత్తలు డాక్టర్ కే.మాధురి, డాక్టర్ వై.పీరుసాహెబ్ అన్నారు. శుక్రవారం వీరు మండలంలోని డేగానిపల్లెలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పంటకు సోకిన కత్తెర పురుగును గుర్తించారు.

# గ్రామాల్లో మొదలైన సంక్రాంతి సందడి

- గంగిరెద్దుల విన్యాసాలు
- పశువుల అలంకరణ
- ఇంటి ముందు రంగవళ్లులు



పండుగకు సిద్ధమైన బసవన్న



మార్కెట్లో పశువుల అలంకరణ వస్తువులు



ఇళ్ల ముందు గెబ్బెమ్మలను ఉంచి పూజలు

గుర్రంకొండ: పల్లెల్లో సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. ఈ ఏడాది కొండలు, గుట్టల్లో తంగేడి పూలు, తురాయిపూలు విర బూసాయి. పల్లెల్లో పండుగ వాతావరణం నిండుగా కనిపిస్తోంది. గ్రామాల్లో ఇప్పటికే గంగిరెద్దుల విన్యాసాలు మొదలయ్యాయి. మార్కెట్లో పశువుల అలంకరణ వస్తువుల అమ్మకాలు జోరందుకున్నాయి. ప్రతి ఇంటి ముందు రంగవళ్లులు కళకళలాడుతున్నాయి.

**గ్రామాల్లో మహిళల సందడి**

సంక్రాంతి పండుగ వచ్చిందంటే మహిళలు ఎన్నో కార్యక్రమాలతో ఆనందంగా గడుపుతుంటారు. గ్రామాల్లో ఇప్పటికే పండుగ ముగ్గుల పోటీలు ప్రారంభమయ్యాయి. దూరప్రాంతాల్లో ఉన్న బంధువులంతా పల్లెలకు చేరుకొని వారంతా ఈపోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. రంగు రంగుల ముగ్గులు వేయడంతోపాటు అందులో ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను ఉంచి వాటిని రంగురంగుల పూలతో అలంకరించి పూజలు నిర్వహించడం ప్రత్యేకత. ఏడాది పొడవునా ఎన్ని పండుగలు వచ్చినా మహిళలు ఉత్సాహంగా పాల్గొనే పండుగ సంక్రాంతి కావడం విశేషం. ఇప్పటికే పట్టణాల్లో ఉన్నవారు సొంతూళ్లకు చేరుకునాను.

**గంగిరెద్దుల విన్యాసాలు**

సంక్రాంతి పండుగ ప్రారంభమైందంటే పల్లెల్లో కనిపించే అరుదైన దృశ్యం గంగిరెద్దుల విన్యాసాలు. పండుగ వారంరోజులు గంగిరెద్దుల దాసులు తమ ఎద్దుల్ని అందంగా అలంకరించి సన్నాయి మేళాలతో పల్లెల్లోకి వస్తుంటారు. తమ వాయిద్యాలతో గంగిరెద్దులను ఆడిస్తూ రైతులను ఆనందంలో ముంచెత్తుతుంటారు. గంగిరెద్దులు ఇళ్ల ముందర విన్యాసాలు చేస్తే శుభం జరుగుతుందని రైతుల భావన. అప్పటికే పండించిన పంటలు ఇళ్లలో ఉండడంతో రైతులు ధాన్యాన్ని గంగిరెద్దులకు దానంగా ఇవ్వడం ఆనవాయితీ.

**పశువుల అలంకరణ**

ఈపండుగకు ముఖ్యంగా పశువుల అలంకరణ వస్తువుల అమ్మకాలు మార్కెట్లో జోరందుకుంటాయి. రంగురంగుల తాళ్లు, గవ్వల మొడతాళ్లు, గలగల గంటల తాళ్లు కొనుగోలు చేసి పశువులకు అందంగా అలంకరిస్తారు. కొమ్ములకు కొప్పులు, రంగురంగుల బెలూన్లు కాగితపూలు వంటి సరంజామా వస్తువులన్నీ మార్కెట్లో కళకళలాడుతున్నాయి. రంగురంగుల చెంకీ హారాలు అందర్ని ఆకట్టుకొన్నాయి. ఇప్పటికే ఇలాంటి వస్తువులన్నీ రైతుల ఇళ్లకు చేరుకొన్నాయి. దీంతో పల్లెలు పండుగ వాతావరణంతో సందడే సందడిగా మారాయి.

## వెలుగు పాఠశాలలో ముందస్తు సంక్రాంతి



ఊయల ఊగుతున్న చిన్నారులు



అంగన్‌వాడీ కార్యకర్తల సంక్రాంతి సంబరాలు

మదనపల్లె సిటీ: పట్టణ శివారు ప్రాంతంలోని అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు రంగు,రంగుల ముగ్గులు వేశారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేశారు. పువ్వులతోత అలంకరించిన ఊయలతో పిల్లలు ఆనందోత్సవాల్లో ఊగారు. గోమాతలకు పూజలు చేశారు. చక్కరపొంగళి, అనపకాయలు, వేరుశనగకాయలు ఉడికించి ప్రసాదంగా అందజేశారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారిలు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రంలో..**

కేవీపల్లె : మండలంలోని ఎంపీపల్లె పంచాయతీ జాండ్రపేట అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం ముందు రంగు రంగులు ముగ్గులు, మామిడి తోరణాలతో అలంకరించారు. బోగిమంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండుగ విశిష్టతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ శశికళ, వీపీఏ బింధు, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, స్వర్ణకుమారి, మంగమ్మ, మునీశ్వరి, సుశీల, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ కాలనీలో నీటి సమస్య పరిష్కారం

మదనపల్లె : నవోదయ కాలనీలో పదేళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. వలసపల్లె పంచాయతీ సర్పంచ్ సరస్వతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు నాగరాజరెడ్డి ఆధ్వర్యంలో కాలనీలోని అన్ని వీధుల్లో నీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరస్వతమ్మ మాట్లాడుతూ నవోదయ కాలనీలో తాగునీటి సమస్యపై స్థానికులు చేసిన వినతిని ఎంపీ మిథున్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఆయన నీటికొళాయిల ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేయడంతో యుద్ధప్రాతిపదికన కొళాయిలు ఏర్పాటు చేసి నీటిసౌకర్యం కల్పించామన్నారు.

## సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

పీలేరు : పంటల సాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహామండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల సాగులో మెలుకవలు, ఆధునిక పద్ధతులు, ఆర్‌బీకేలో కలిగే ప్రయోజనంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది బిందు, నజీర్ పాల్గొన్నారు.

## నేడు మకరజ్యోతి దర్శనం

వాల్మీకిపురం: స్థానిక కోనేటివీధిలోని శ్రీ శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం 6:45 గంటలకు మకరజ్యోతి దర్శనం ఉంటుందని గురుస్వామి టమాట రామచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామివారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల మకరజ్యోతిని దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

# ప్రజలు సుఖశాంతులతో జీవించాలి

- గోమాతకు ప్రత్యేక పూజలు
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



గోమాతకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: నియోజకవర్గం పాడిపంటలతో కలకలాడుతూ ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మొక్కుకున్నారు. శుక్రవారం మండలంలోని గోళ్లపల్లెవారిపల్లె సమీప అటవీ ప్రాంతంలోని కణికలమ్మ గోశాలను శుక్రవారం సందర్శించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గోశాల నిర్వాహకులు మణికంఠన్ శివ, విశ్వేశ్వరన్, కార్తీక్ ఆధ్వర్యంలో గోమాత ప్రత్యేక పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదపండితులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గోమాతకు పూజలు నిర్వహించారు. 300 దేశవాళి పశువులతో గోశాల నిర్వహించడం అభినందనీయమన్నారు. 70 ఎకరాల విస్తీర్ణంలో పకృతి వ్యవసాయం నిర్వహిస్తూ రైతులకు ఆదర్శంగా ఈ గోశాల నిలిచింది. స్థానికులకు రోజూ 50 నుంచి 100 మంది వరకు ఉపాధి కల్పిస్తూ ఈ గోశాల నిర్వహిస్తున్నారు. పకృతి సేద్యం తో వరి, చిరుధాన్యాలు, కూరగాయలు చెరకు వంటి పంటలను పండించడం విశేషం. పకృతి సిద్ధంగా కషాయాల వినియోగాలతో పంటల సాగు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగ కార్యదర్శి కె.జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు మహేష్, రాష్ట్రపద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్ , అభివృద్ధికమిటీచైర్మన్ నారాయణరెడ్డి, గోశాల నిర్వాహకుల తల్లి కళ్యాణి, మేనేజర్ రామూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంకిశెట్టిపల్లె సచివాలయం తనిఖీ



అంకిశెట్టిపల్లె నూతన సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : మండలంలోని అంకిశెట్టిపల్లె సచివాలయాన్ని శుక్రవారం సాయంత్రం ఆర్డీఓ ఎం.ఎస్. మురళి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని విభాగాల వారీగా పిలిచి, వారి శాఖలకు సంబంధించి ప్రగతిపై విచారించారు. హౌసింగ్‌కు సంబంధించిన పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. పునాదులు, గోడల స్థాయిలో నిలిచిపోయిన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా లబ్ధిదారులను చైతన్యపరచాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హత ఉన్న వారితో దరఖాస్తు చేయించాలన్నారు. విధి నిర్వహణలో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, కార్యాలయం నుంచి అధికారిక పనులపై బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సచివాలయంలో ప్రతిరోజు సాయంత్రం 3 నుంచి 5 వరకు స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, వచ్చిన ఫిర్యాదులపై సత్వర స్పందన కనబరచాలన్నారు. స్థానికంగా నిర్మాణంలో ఉన్న నూతన సచివాలయ భవనాన్ని పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం కన్వర్షన్ నిమిత్తం వచ్చిన దరఖాస్తును క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్ శరత్‌రెడ్డి, మండల సర్వేయర్ ముబారక్, వీఆర్వో చంద్రమోహన్ ఉన్నారు.

# తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



మైనారిటీ నాయకులతో సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : పట్టణంలోని సైనిక్‌నగర్‌లోని మసీదు వద్ద తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శుక్రవారం అయన సైనిక్‌నగర్‌లో సమస్యలపై స్థానిక మైనారిటీ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా బోరు కావాలని కోరడంతో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో తక్షణం మంజూరు చేస్తామని త్వరలో బోరు, మోటారు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని కామాటంవారిపల్లె, కావలిపల్లెలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా కనుమ పండుగకు ఏర్పాట్లు చేపించారు. సొంత నిధులతో జేసీబీతో చదును చేపించారు. ఈ కార్యక్రమంలో ఉదయ్, ఆనంద్, షాకీర్, రమణ, పెద్దోడు, కాలనీ చిన్న, శ్రీరామసుధాకర్, మునీర్, అబీద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలోచించి నిర్ణయం చెబుతాం..

ముదివేడు రిజర్వాయర్ భూనిర్వాసితులు



మాట్లాడుతున్న తహసీల్దారు భీమేశ్వర రావు

కురబలకోట: ఉన్న ఊరు..దశాబ్దాల అనుబంధం.. వారసత్వ సంపదతో పాటు సర్వస్వం కోల్పోతున్నాం..పునరావాసంలో భాగంగా అధికారులు చెబుతున్న ఆర్‌అండ్ ఆర్ కాలనీ స్థలాన్ని పరిశీలించి నిర్ణయం చెబుతామని ముదివేడు రిజర్వాయర్ భూనిర్వాసితులు స్పష్టం చేశారు. శుక్రవారం ఆర్ అండ్ ఆర్ అధికారులతో కలసి భూ నిర్వాసితులతో తహసీల్దారు భీమేశ్వరరావు గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముదివేడు ఫారెస్టు ఎదురుగా హైవేని ఆనుకునే 834/బి సర్వే నెంబరులో 25 ఎకరాల విస్తీర్ణాన్ని ఇంటి స్థలాలకు సేకరించామన్నారు. 220 కుటుంబాలు ఉన్నాయన్నారు. అటు రైల్వే స్టేషన్ ఇటు మార్కెట్ యార్డు, మరో వైపు కుడి ఎడమలగా అంగళ్లు, ముదివేడు ఉన్నాయన్నారు. అంగళ్లులో వివిధ కళాశాలలు, నీటి సౌకర్యం ఉందన్నారు. పరిసరాల్లో వ్యవసాయ భూములు కూడా ఉన్నాయన్నారు. మండల కేంద్రానికి నిమిషాల వ్యవధిలో చేరుకోవచ్చన్నారు. పెద్దమనుషులతో కలసి అధికారులు ఎంపిక చేసిన భూమిని మరోసారి పరిశీలిస్తామని, ఏ విషయం ఆలోచించి నిర్ణయం చెబుతామని అధికారులకు వెల్లడించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ముదివేడు ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో భూ నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకుంటారన్నారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితుల వివరాలను తహసీల్దారు గ్రామ సభలో చదివి వినిపించారు.

## చిరుధాన్యాల ఉత్పత్తులపై అవగాహన

కలికిరి: కేవీకే కేంద్రంలో వ్యవసాయ పరిశోధన స్థానం, పెరుమాళ్లపల్లి వారి ఆధ్వర్యంలో మహిళలకు చిరుధాన్యాల ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త శాంతిప్రియ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆహారపు అలవాట్లలో చిరుధాన్యాల ఉత్పత్తులు ఉండేలా చూసుకోవాలని, చిరుధాన్యాలతో ఆరోగ్య రక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. మహిళలు చిరుధాన్యాల ఉత్పత్తులతో ఆర్థిక స్వాలంబన సాధించవచ్చన్నారు. అనంతరం చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు జ్యోతి, శ్రీనివాసులు, మహిళలు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : పోలీసు పరీక్ష కేంద్రాలను డీఎస్పీ కేశప్ప శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22న జరగనున్న పోలీసు ఉద్యోగ అభ్యర్థులకు నిర్వహించే పరీక్షలకు 17 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మదనపల్లె మండలంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, కృష్ణ చైతన్య ఫార్మసీ, పాలిటెక్నిక్ కళాశాలతో పాటు 14 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు హరిహరప్రసాద్, చంద్రమోహన్, జెడ్పీ హెచ్‌ఎం రెడ్డన్నశెట్టి పాల్గొన్నారు.

## రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

తంబళ్లపల్లె: గ్రామ పంచాయితీ నిర్వహణలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆడిటర్ శంకరయ్య కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కన్నెమడుగు, కోటకొండ గ్రామ పంచాయితీలలో ఆడిటింగ్ నిర్వహించారు. ప్రభుత్వం నుంచి పంచాయతీకి వచ్చిన నిధులు, జమా ఖర్చులకు సంబందించిన రికార్డులు పరిశీలించి ఆడిటింగ్ పూర్తి చేశారు.

## టీటీడీకి కూరగాయలు వితరణ

మదనపల్లె సిటీ: టీటీడీ అన్నదాన కార్యక్రమానికి వ్యాపారులు కూరగాయలను వితరణగా పంపారు. స్థానిక వారపుసంతలో కూరగాయల వ్యాపారి దాదాపీర్ ఏడు వాహనాల్లో వివిధ రకాల కూరగాయలను ప్రత్యేక వాహనంలో తిరుమలకు పంపారు. వాహనాన్ని ఎమ్మెల్యే నవాజ్‌బాషా జెండా ఊపి పంపారు. సుమారు 20 టన్నుల వివిధ రకాల కూరగాయలను పంపించిన వ్యాపారి దాదాపీర్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

## కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

మదనపల్లె : సంక్రాంతి పండుగ సందర్భంగా తాలూకా పరిధిలో జూదం, కోడిపందేలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని సుఖసంతోషాలతో జరుపుకోవాలని సూచించారు.

ములకలచెరువు: మండలంలో సంక్రాంతి పండుగ సందర్భంగా చట్ట వ్యతిరేకమైన కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ డీవై స్వామి హెచ్చరించారు. శుక్రవారం ఎస్‌ఐ విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో కోడి పందేలు, పేకాట, ఎడ్ల పందాలు నిర్వహిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కలకడ : కోడిపందేలు నిర్వహిస్తే కేసులు తప్పవని ఎస్‌ఐ సిటిస్వామి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీలలో పర్యటించి పాత నేరస్తులను తహసీల్దార్ రాము వద్ద బైండోవర్ చేయించారు.

# నవరత్నాలతో ప్రజల జీవనం మెరుగు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: నవరత్నాల పథకాలతో ప్రజల జీవనం మెరుగుపడుతోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నగిరిమడుగు పంచాయతీ బురుజుగడ్డ, నగిరిమడుగు, వెలగపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. మూడన్నర ఏళ్లుగా ఎక్కడ ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలు, రూపాయి లంచం లేకుండా నేరుగా అర్హులకే చేరే విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అన్నివర్గాల వారికి మంచి చేస్తూ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందరి గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, సర్పంచ్ రజని, నాయకులు రెడ్డెప్ప రెడ్డి, సురేంద్ర రెడ్డి, రెడ్డెప్ప, చిన్నా, నీళ్లభాస్కర్, ఈశ్వర్ రెడ్డి, వెంకట్రమణ రెడ్డి, హరినాథ రెడ్డి, నాగిరెడ్డి, అమరనాథరెడ్డి, క్రిష్టారెడ్డి, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కమర్షియల్ పరంగా పీలేరు డిపోకు ప్రథమస్థానం



మాట్లాడుతున్న ఆర్టీసీ డైరెక్టర్ రాజారెడ్డి

పీలేరు రూరల్ : జిల్లాలో కమర్షియల్ పరంగా పీలేరు డిపో ప్రథమ స్థానంలో ఉందని ఆర్టీసీ డైరెక్టర్ రాజారెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఆర్టీసీకి కమర్షియల్ తో నెలకు రూ. 36 లక్షలు వస్తోందని తెలిపారు. అందులో పీలేరు నుంచి రూ. 16 లక్షలు, మదనపల్లె నుంచి రూ. 14 లక్షలు వస్తున్నట్లు చెప్పారు. పీలేరు ఆర్టీసీ ప్రాంగణం, స్థానిక చిత్తూరు రోడ్డులో ఎస్‌వోటీ 15 సంవత్సరాలు, బీఓటీ 33 సంవత్సరాలకు వ్యాపార వేత్తలకు ఖాళీ స్థలాల అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, డీఎం కుమార్, సీఐ ధనుంజయులు, ఎంఎఫ్ హరినాథరెడ్డి, ఎస్టీఐ సుధాకర్‌నాయక్, బస్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# ఈ-క్రాప్ నమోదుతో ప్రయోజనాలు

కలకడ : ఈ-క్రాప్ నమోదు చేసుకోవడం రైతులకు ఎంతో ప్రయోజనమని ఇరిగేషన్ ఏఈ స్వర్ణలత, హార్టికల్చర్ అధికారి ఆంజినేయులు అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా సంఘం సమావేశాన్ని ఆ సంఘం అధ్యక్షుడు హరినాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, సిబ్బంది ప్రభుత్వం నుంచి రాయితీపై లభించే పరికరాలు, ఉపయోగాలను తెలియజేశారు. అలాగే టమాట మార్కెటింగ్ విధానం, రాయితీపై అందించే వ్యవసాయ పరికరాల గురించి తెలియజేశారు.